జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

గురువారం | 16 | జులై | 2026 • పేజీలు : 6

## ప్రసవం విషాదం...
# ప్రాణాపాయంలో తల్లీ, బిడ్డ

- రామవరం ప్రభుత్వ ఆసుపత్రి లో దారుణ ఘటన
- వైద్య నిర్లక్ష్యమంటూ బంధు వుల ఆరోపణ



**ములకలపల్లి జూలై 15 (ప్రజాజ్యోతి):** ప్రసవం కోసం ఆసుపత్రికి వెళ్లిన ఓ మహిళ, ఆమెకు జన్మించిన నవజాత శిశువు ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో

మిగతా 2 లో...




## భద్రాద్రిలోనూ రౌడీషీటర్లకు..
# డ్రగ్ టెస్టులు అవసరమే..!

- హైదరాబాద్ తరహాలో రౌడీషీటర్లు, నేరచరిత్ర ఉన్న వారిపై పరీక్షలకు డిమాండ్
- వినియోగదారులతో పాటు సరఫరా గొలుసును గుర్తించే అవకాశమనే అభిప్రాయం
- చత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లా కావడంతో గంజాయి నియంత్రణకు శాస్త్రీయ విధానాలు అవసరమనే అభిప్రాయం
- జిల్లాలో గంజాయి వినియోగం కట్టడికి ఇదే మంచి మార్గమని సూచనా..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 15, ప్రజాజ్యోతి:** చత్తీస్‌గఢ్ సరిహద్దుకు ఆనుకుని ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, వినియోగం ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక డ్రగ్ టెస్టులు నిర్వహించాలని ప్రజలు, సామాజిక వర్గాలు కోరుతున్నాయి. ప్రస్తుతం పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకోవడం, అక్రమ రవాణా ముఠాలను అరెస్టు చేయడం వంటి చర్యలు చేపడుతున్నప్పటికీ, వినియోగదారులను గుర్తించడం, వారికి గంజాయి చేరవేస్తున్న సరఫరా గొలుసును పూర్తిస్థాయిలో ఛేదించేందుకు డ్రగ్ స్క్రీనింగ్ కూడా అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవల హైదరాబాద్ నగర పోలీసులు రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక డ్రగ్ టెస్టులు నిర్వహించి గంజాయి వినియోగించిన పలువురిని గుర్తించారు. ఆ ప్రక్రియ ద్వారా వినియోగదారులను మాత్రమే కాకుండా వారికి మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న వ్యక్తులు, నెట్‌వర్క్‌పై కూడా దర్యాప్తు సాగించే అవకాశం లభించింది. ఇదే విధానాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ అమలు చేస్తే

మిగతా 2 లో...

# నిందితులు ఆరుగురే..!

- ప్రజా జ్యోతి లేవనెత్తిన ప్రశ్నలకు దర్యాప్తులో లభించిన తొలి స్పష్టత..
- ఆధారాలు లభిస్తే మధ్యవర్తుల ప్రమేయం పై చర్యలు..?


ప్రజాజ్యోతి
15 Jul 2026 - Page 1
7 లో..
బ్లాక్‌మెయిల్ ఉచ్చులో మైనర్..?


ప్రజాజ్యోతి
14 Jul 2026 - Page 1
పోక్సో కేసుపై అనుమానాల ముసురు..!

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 15, ప్రజా జ్యోతి:** టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసు ప్రారంభ దశలో కేసు విచారణ తీరుపై పలు ప్రశ్నలు వ్యక్తమయ్యాయి. మొదట కొందరిపైనే చర్యలు తీసుకున్నట్లు సమాచారం రావడంతో, ఘటనలో మరికొందరి పాత్ర కూడా ఉందా..? కేసు పూర్తి స్థాయిలో దర్యాప్తు జరుగుతోందా..? అనే అంశాలను ప్రజా జ్యోతి తన ప్రత్యేక కథనంలో ప్రస్తావించింది. అందులో ప్రజాజ్యోతి చేసిన ఇన్వెస్టిగేషన్ లో ప్రస్తుతానికి 6 గురు ఉన్నారని ప్రత్యేకంగా అందులో పేర్కొంది. ఈ నేపథ్యంలో పోలీసులు చేపట్టిన తదుపరి దర్యాప్తులో కేసు పరిధి మరింత విస్తరించింది. తాజాగా ఎస్‌డీపీఓ నిర్వహించిన అధికారిక ప్రెస్‌మీట్‌లో మొత్తం ఆరుగురు అభియుక్తుల పాత్రను గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. వారిలో నలుగురిని అరెస్టు చేసినట్లు, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని తెలిపారు. దీంతో కేసులో మొత్తం ఎంతమంది

మిగతా 2 లో...

## మెడికల్ విద్యార్థినుల హాస్టల్‌లో
# పట్టపగలు చోరీ

- నగదు, ఐప్యాడ్‌లు, ఇయర్‌ఫోన్లు మాయం
- సీసీ కెమెరాలు లేక పోవడంపై విద్యార్థినుల ఆందోళన
- భద్రత పెంచాలని మెడికోలు డిమాండ్..



2 లో...

# నలుగురు అరెస్ట్... ఇద్దరి కోసం గాలింపు

- పోక్సో కేసులో పోలీసుల కీలక ప్రకటన
- ఆరుగురి పాత్రను గుర్తించిన పోలీసులు
- 3 ఆటోలు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం
- దర్యాప్తు ఇంకా కొనసాగుతోందన్న అధికారులు
- వివరాలు వెల్లడించిన కొత్తగూడెం ఎస్‌డీపీఓ ఎల్. ఆదినారాయణ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 15, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో పోలీసులు అధికారికంగా కీలక వివరాలను బుధువారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఇప్పటివరకు సాగిన దర్యాప్తులో మొత్తం ఆరుగురు వ్యక్తుల పాత్రను గుర్తించినట్లు కొత్తగూడెం ఎస్‌డీపీఓ ఎల్. ఆదినారాయణ తెలిపారు. వీరిలో నలుగురిని అరెస్ట్ చేసినట్లు, మరో ఇద్దరి కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు వెల్లడించారు. కేసుకు సంబంధించి మూడు ఆటోలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు కూడా తెలిపారు. ఈ నెల 11 వ తారికున బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసామని అన్నారు. సంఘటనలకు సంభందించి పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. బాదితిరాలైన మైనర్ బాలికతో మొదట ఒక నిందితుడికి పరిచయం ఏర్పడగా, అనంతరం ఆ పరిచయం ద్వారా మరి కొందరు నిందితులు కూడా ఆమెకు దగ్గరయ్యారని దర్యాప్తులో వెల్లడైనట్లు పేర్కొన్నారు. అనంతరం వేర్వేరు తేదీల్లో ఆమెను బయటకు

మిగతా 2 లో...

# భద్రాద్రిలోనూ రౌడీషీటర్లకు డ్రగ్ టెస్టులు అవసరమే..!

(మొదటి పేజీ తరువాయి...)

గంజాయి నియంత్రణ మరింత సమర్థవంతంగా సాగుతుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చత్తీస్‌గఢ్ రాష్ట్రానికి సరిహద్దుగా ఉండటం వల్ల గంజాయి అక్రమ రవాణాకు ప్రధాన మార్గాల్లో ఒకటిగా పలుమార్లు వెలుగులోకి వచ్చింది. అడవి మార్గాలు, అంతర్రాష్ట్ర రహదారులను వినియోగించి గంజాయిని తరలించే ప్రయత్నాలను పోలీసులు ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నారు. అయినప్పటికీ జిల్లాలో అప్పుడప్పుడు గంజాయి పట్టుబడుతుండటం, వినియోగానికి సంబంధించిన కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో కేవలం పట్టివేతలు, అరెస్టులతోనే పరిమితం కాకుండా శాస్త్రీయ విధానాల ద్వారా కూడా మాదకద్రవ్యాల నియంత్రణ చేపట్టాలని పలువురు సూచిస్తున్నారు. ముఖ్యంగా రౌడీషీటర్లు, పాత నేరస్థులు, ఎన్‌డీపీఎస్ చట్టం కింద గతంలో కేసులు నమోదైన వ్యక్తులపై దశలవారీగా డ్రగ్ టెస్టులు నిర్వహిస్తే గంజాయి వినియోగదారులను గుర్తించడంతో పాటు సరఫరా వ్యవస్థపై కూడా కీలక సమాచారం లభించే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. డ్రగ్ టెస్టుల్లో గంజాయి వినియోగం నిర్ధారణ అయిన వారికి అవసరమైన కౌన్సెలింగ్, డీ-అడిక్షన్ సేవలు అందించడం, మరోవైపు సరఫరా ముఠాలు, పునరావృత నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణ మరింత బలోపేతం అవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో అమలు చేస్తున్న తరహా విధానాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పరిశీలిస్తే గంజాయి నియంత్రణకు ఇది మరో సమర్థవంతమైన చర్యగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



హైదరాబాదులో రౌడీషీటర్లు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్న దృశ్యం

## మంత్రుల రాకతో కళకళలాడుతున్న రోడ్లు

- నెలల తరబడి గుంతలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు – పట్టించుకోని అధికార యంత్రాంగం
- మంత్రి పర్యటన నేపథ్యంలో హడావుడిగా రోడ్ల మరమ్మత్తులు
- అధికారి యంత్రాంగం పనిచేసేది
- "ప్రజల కోసమా ""మంత్రుల మన్నల కోసమా"

**అశ్వాపురం, జులై 15, ప్రజా జ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో నెలల తరబడి గుంతలతో అధ్వాన్నంగా మారిన రహదారులు మంత్రి పర్యటన నేపథ్యంలో ఒక్కసారిగా మరమ్మత్తుల పనులతో కలకలలాడుతున్నాయి. వర్షాకాలం కారణంగా రహదారులపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి, రాత్రి వేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురు ప్రమాదాలకు గురికాగా, కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టాలు కూడా సంభవించినా అధికార యంత్రాంగం స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల దుస్థితిపై ప్రజలు పలుమార్లు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, పత్రికల ద్వారా సమస్యను వెలుగులోకి తీసుకొచ్చినా ఆశించిన స్థాయిలో చర్యలు చేపట్టలేదని మండల ప్రజలు వాపోతున్నారు. అయితే, మంత్రుల పర్యటన ఉందని తెలిసిన వెంటనే రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చేందుకు అధికారులు హడావుడిగా పనులు ప్రారంభించడం విమర్శలకు తావిస్తోంది. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నప్పుడు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యటన కోసం మాత్రమే అప్రమత్తం కావడం సరైన పరిపాలన కాదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. "అధికార యంత్రాంగం పనిచేసేది ప్రజల కోసమా? లేక మంత్రుల మెప్పు కోసమా?" అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల కష్టాలు కనిపించనప్పుడు స్పందించని అధికారులు, మంత్రి పర్యటన నేపథ్యంలో మాత్రమే రోడ్ల మరమ్మత్తులు చేపట్టడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా, శాశ్వత పరిష్కారంగా నాణ్యమైన రహదారులు నిర్మించాలని మండల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. "ఇన్ని రోజులు రోడ్లపై కనిపించని ప్రేమ... మంత్రుల రాకతో ఒక్కసారిగా ఎలా వచ్చింది?" అనే ప్రశ్న ఇప్పుడు అశ్వాపురం మండల ప్రజల్లో వినిపిస్తోంది. ప్రజల ప్రాణాల కంటే మంత్రి పర్యటనలకే ప్రాధాన్యం ఇస్తున్న అధికార యంత్రాంగం తన వైఖరిని మార్చుకుని, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు....



## నలుగురు అరెస్ట్... ఇద్దరి కోసం గాలింపు

(మొదటి పేజీ తరువాయి...)

తీసుకెళ్లి నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఘటనలకు సంబంధించిన వివరాలను బాధితురాలి ఫిర్యాదు, వాంగ్మూలం, ఇతర ఆధారాల ఆధారంగా సేకరించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ముర్రి రామకృష్ణ (ఎ 1), కల్వల విజయేందర్ (ఎ 2), ఉడత మహేష్ (ఎ 3), జాలే నవీన్ (ఎ 4)లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు గణేష్ (ఎ 5), వెంకటేష్ (ఎ 6) పరారీలో ఉన్నారని, వారి కోసం గాలింపు కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసులో భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)తో పాటు పోక్సో చట్టం, ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్‌డీపీఓ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు, వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలు, ఇతర సాక్ష్యాలను సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు, కేసులో పరారీలో ఉన్న ఇద్దరు నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున అవసరమైతే తదుపరి చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసు జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, దర్యాప్తును వేగంగా పూర్తి చేసి, వాస్తవాలను పూర్తిస్థాయిలో వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ఈ సమావేశంలో 1 టౌన్ సిఐ కరుణాకర్ తో పాటు మరికొంత మంది పోలిస్ సిబ్బంది ఉన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- హోమియో వైద్యాధికారి డా. పూజ

**చర్ల, జూలై 15: (ప్రజా జ్యోతి):** విద్యార్థులు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చర్ల హోమియో వైద్యాధికారి డా. పూజ సూచించారు. చర్ల మండలంలోని ఉంజుపల్లి ఎస్టీ బాలుర హాస్టల్లో బుధవారం మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పూజ మాట్లాడుతూ సరదా కోసం లేదా స్నేహితుల ఒత్తిడితో గుట్కా, తంబాకు, బీడీ, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలను ఉపయోగించడం ప్రారంభించిన వారు క్రమంగా వాటికి బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఇటువంటి అలవాట్లు ఆరోగ్యంతో పాటు విద్య, భవిష్యత్తు, కుటుంబ జీవితంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. మత్తు పదార్థాల వ్యసనం వల్ల శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక సమస్యలు తలెత్తే అవకాశముందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థి దశలో చెడు అలవాట్లు ఏర్పడితే చదువులో వెనుకబడటంతో పాటు జీవిత లక్ష్యాలను చేరుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు. విద్యార్థులు మంచి స్నేహితులను ఎంచుకోవాలని, చెడు అలవాట్లు ఉన్న వారి ప్రభావానికి లోనుకాకుండా జాగ్రత్తపడాలని సూచించారు. ఇప్పటికే మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు కూడా దృఢ సంకల్పంతో ప్రయత్నిస్తే వ్యసనం నుంచి బయటపడవచ్చని తెలిపారు. మత్తు పదార్థాలను వెంటనే మానేసి, వాటికి ప్రేరేపించే వ్యక్తులు, ప్రదేశాలకు దూరంగా ఉంటే వ్యసన విముక్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. "మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉంది" అంటూ విద్యార్థులకు ప్రేరణనిచ్చారు. అనంతరం వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులను పరీక్షించి హోమియో మందులు పంపిణీ చేశారు. హోమియో వైద్యం ద్వారా కలిగే ప్రయోజనాలను కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.



## మెడికల్ విద్యార్థినుల హాస్టల్‌లో పట్టపగలు చోరీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, జూలై 15, ప్రజాజ్యోతి :** భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలకు చెందిన విద్యార్థినులు ఉంటున్న హాస్టల్‌లో పట్టపగలు చోరీ జరగడం కలకలం రేపింది. లక్ష్మీదేవిపల్లి సమీపంలోని మహేశ్వరి థియేటర్ వద్ద ఉన్న లేడీస్ హాస్టల్‌లో గురువారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు విద్యార్థినులు తెలిపారు. ఈ ఘటనలో సుమారు రూ.10 వేల నగదుతో పాటు నాలుగు ఐప్యాడ్‌లు, 15 ఇయర్‌ఫోన్లు, ఒక పవర్ బ్యాంక్ కనిపించకుండా పోయినట్లు పేర్కొన్నారు. విద్యార్థినుల కథనం ప్రకారం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల మధ్య ఈ చోరీ జరిగినట్లు అనుమానిస్తున్నారు. ఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చామని, అయితే పోలీసులు సాయంత్రం 4.30 నుంచి 5 గంటల మధ్య హాస్టల్‌కు వచ్చి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఈ హాస్టల్‌లో సీసీ కెమెరాలు లేకపోవడం, భద్రతా సిబ్బంది తగిన స్థాయిలో లేకపోవడంపై విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హాస్టల్ వెనుక భాగంలో బాలుర హాస్టల్ ఉండగా, మరో వైపు థియేటర్, మెకానికల్ వర్క్‌షాప్ ఉండటంతో ఎప్పుడూ రాకపోకలు ఎక్కువగా ఉంటాయని, దీంతో భద్రతా సమస్యలు ఎదురవుతున్నాయని చెబుతున్నారు. తమ భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన విద్యార్థినులు, హాస్టల్ వద్ద వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, 24 గంటల భద్రతా సిబ్బందిని నియమించాలని, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల యాజమాన్యాన్ని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు హాస్టల్‌కు చేరుకుని వివరాలు సేకరించారు. చోరీ జరిగిన తీరుపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. హాస్టల్‌లో భద్రతా లోపాలపై కూడా ఆరా తీస్తున్నట్లు సమాచారం.

## ప్రసవం విషాదం....... ప్రాణాపాయంలో.. తల్లీ, బిడ్డ

(మొదటి పేజీ తరువాయి...)



చికిత్స పొందుతున్న ఘటన ములకలపల్లి మండలంలో తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ, సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని చాపరాలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కుమ్మరిపాడు గ్రామానికి చెందిన తాటి భవాని ప్రసవం కోసం రామవరంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో చేరింది. ప్రసవం అనంతరం తల్లి, నవజాత శిశువు ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించడంతో మెరుగైన వైద్యం కోసం మరో ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రసవ సమయంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే తల్లి, శిశువు పరిస్థితి అత్యంత విషమంగా మారిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. సరైన సమయంలో వైద్యులు స్పందించి ఉంటే పరిస్థితి విషమించేది కాదని బంధువులు ఆరోపిస్తూన్నారు. ప్రస్తుతం తల్లిబిడ్డ ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని, కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు వెంటనే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలికితీయాలని, వైద్య నిర్లక్ష్యం జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ, ప్రసూతి ఆసుపత్రుల పనితీరుపై పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నిందితులు ఆరుగురే..!

(మొదటి పేజీ తరువాయి...)

పాత్ర ఉంది అనే అంశంపై తొలి అధికారిక స్పష్టత లభించినట్లైంది. ఈ సందర్భంగా కేసులో మరికొందరు మధ్యవర్తులుగా వ్యవహరించారనే ప్రచారం, రాజీ ప్రయత్నాలు జరిగాయనే ఆరోపణలపై ప్రజా జ్యోతి పోలీసులను ప్రశ్నించింది. దీనిపై స్పందించిన అధికారులు, ప్రస్తుతం అలాంటి అంశాలను నిర్ధారించే ఆధారాలు తమ వద్ద లేవని తెలిపారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, చార్జిషీట్ దాఖలు చేసేందుకు ఇంకా సమయం ఉందని చెప్పారు. ఈలోపు మధ్యవర్తిత్వం, రాజీ ప్రయత్నాలు లేదా ఇతరుల ప్రమేయానికి సంబంధించిన విశ్వసనీయ ఆధారాలు లభిస్తే, చట్టప్రకారం వారినీ దర్యాప్తు పరిధిలోకి తీసుకుని అవసరమైతే కేసులో చేర్చి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# అడవిరామారంలో పంచాయతీ అభివృద్ధి పనుల పరిశీలన

- **ఇందిరమ్మ ఇళ్లు, పాఠశాల మధ్యాహ్న భోజనం, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన కాంగ్రెస్ నాయకులు**

**ఆళ్లపల్లి,జూలై15(ప్రజా జ్యోతి)** పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఆళ్లపల్లి మండలంలోని అడవిరామారం గ్రామపంచాయతీని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ ఆధ్వర్యంలో సందర్శించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పాయం సూర్యకాంతంను కలిసి పంచాయతీలో మౌలిక వసతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సర్పంచ్‌తో కలిసి నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా





తీశారు.తదుపరి గ్రామ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన నాయకులు విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి సంబంధిత సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అలాగే గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం అమలుపై ప్రజలను అడిగి తెలుసుకుని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అడవిరామారం గ్రామ సర్పంచ్ పాయం అనసూర్య, దంపతులు నూతనంగా నియమితులైన ఆళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్ కి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ అతహర్, పాయం సత్యనారాయణ, తాళ్లపల్లి కృష్ణాహరి, తెల్లం జనార్ధన్, కొమరం చంద్రం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఇందు కుమార్, కోనేటి వీరభద్రచారి, యువజన నాయకులు ఉల్లోజు భరత్ సాయి, మండలోజు ప్రశాంత్, శ్రీరామ్ సంపత్, మంద సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాఘవాపురం పాఠశాల ఉపాధ్యాయురాలి పై డీఈఓ కి (ఎస్ఎంసి) సభ్యుల పిర్యాదు



**ఆళ్ళపల్లి,జూలై15.(ప్రజా జ్యోతి)**ఆళ్లపల్లి మండలంలోని ఎంపీపీఎస్ రాఘవాపురం పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉపాధ్యాయురాలు పై పలు ఆరోపణలు చేస్తూ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఏంసి) సభ్యులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సమగ్ర విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విన తిప త్రాన్నిఅ ంద జేశారు. విన తిపత్రంలో సదరు ఉపాధ్యాయుడు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పాఠశాల నిర్వహణ, విద్యాబోధన, విద్యార్థుల పట్ల బాధ్యత విషయంలో పలు లోపాలు ఉన్నాయని ఆరోపించారు. దీంతో విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతోందని, పాఠశాల ప్రతిష్ఠ దెబ్బతింటోందని పేర్కొన్నారు.అంతేకాకుండా ఈ వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారి స్వయంగా లేదా సంబంధిత అధికారులతో నిష్పాక్షిక విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మరో ఉపాధ్యాయులను నియమించలని (ఎస్ఏంసి) సభ్యులు తమ ఫిర్యాదులో కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా అధికారులు తక్షణమే స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా వెంకటాద్రి 40 వ వర్ధంతి వేడుకలు

- **చింతలచెర్వు వెంకటాద్రి సేవలు చిరస్మరణీయం**



**చర్ల, జూలై 15 (ప్రజా జ్యోతి):** స్వాతంత్ర సమరయోధుడు, తామ్రపత్ర గ్రహీత చింతలచెర్వు వెంకటాద్రి 40వ వర్ధంతి సందర్భంగా బుధవారం చర్లలోని శైలజా విహార్‌లో ఘనంగా స్మారక సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం.మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.తొలుత చర్ల గ్రంధాలయంలో చింతల చెర్వు వేంకటాద్రి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని చింతలచెర్వు వెంకటాద్రి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బ్రిటీష్ పాలకుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న చింతలచెర్వు వెంకటాద్రి భద్రాచలం డివిజన్ ప్రాంత ప్రజల్లో దేశభక్తి, స్వేచ్ఛా స్ఫూర్తిని నింపిన మహనీయుడని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలు శిక్షను అనుభవించిన ఆయన స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు .ప్రజలను చైతన్యవంతం చేస్తూ స్వాతంత్ర్య సమరంలో కీలక పాత్ర పోషించిన గొప్ప దేశభక్తుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.చర్ల మండల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తేగడ బ్రిడ్జి, జూనియర్ కాలేజీ ఇలా మండలంలోని అనేక అభివృద్ధి కార్యక్రమాలకు వారి సేవలు మరువలేవని అన్నారు. చింతల చెర్వు వెంకటాద్రి సేవలు తదనంతరం వారి తనయుడు సీవీకే రావు కొనసాగిస్తూ మండల అభివృద్ధికి తన వంతుగా తాను సహాయ సహకారాలు అందించారని వారి తదనంతరం వారి తనయులు చింతల చెర్వు రమణ, చింతల చెర్వు సతీష్ లు కొనసాగిస్తూ వారి ఆశయాలను ప్రజా సేవలో వారిదైన శైలిలో ముందుకు సాగుతున్నారు అని నేటి కాలంలో ఇటువంటి వారు అరుదుగా ఉంటారని వారు కొనసాగిస్తున్న ఈ సాంప్రదాయానికి మనందరం అభినందనలు తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భగా ముఖ్య అతిథి ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ఎం. మురళి మాట్లాడుతూ చర్ల మండలం నుంచి ఇంతటి గొప్ప స్వాతంత్ర సమరయోధుడు ఉండటం తనకు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు. సభ ప్రారంభానికి ముందు వెంకటాద్రి జీవిత విశేషాలను తెలుసుకున్న తర్వాత ఆయన జీవితం తనకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని చెప్పారు. సాధారణ పట్వారీగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి అనంతరం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని దేశసేవకు అంకితమవడం అసాధారణ విషయమన్నారు.అల్లూరి సీతారామరాజు వంటి మహనీయులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొని బ్రిటీష్ పాలకులను ఎదిరించడం చిన్న విషయం కాదని అలాంటి మహనీయుడి సేవలు చర్ల ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు . స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రజాసేవ నేటి యువతకు మార్గదర్శకమని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.చింతలచెర్వు వెంకటాద్రి చూపిన సేవా మార్గాన్ని అనుసరిస్తూ ప్రజల సంక్షేమం కోసం అందరూ కృషి చేయాలని ఆయన ఆశయాలకు అనుగుణంగా చర్ల ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. మహనీయుల జీవిత చరిత్రలను యువతకు పరిచయం చేయడం ద్వారా దేశభక్తి, సామాజిక బాధ్యత పెంపొందుతుందని ట్రైనీ కలెక్టర్ అన్నారు.అనంతరం ట్రైనీ కలెక్టర్ మురళిని చింతలచెర్వు వెంకటాద్రి కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం 14మంది మహిళకాకి ,వృద్ధులకు చీరలు ,దుస్తులు పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో మండల తాసిల్దార్ శ్రీనివాస్ ,ఎంపీడీవో ఈదయ్య, ట్రైనీ కలెక్టర్ మురళి ,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు చీమలమర్రి మురళీకృష్ణ, టిపిసిసి సెక్రెటరీ నల్లపు దుర్గాప్రసాద్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ నాయుడు , కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు మండల ప్రజలు పాల్గొన్నారు

## గుండెపోటుతో న్యాయవాది మృతి





**ఇల్లందు, జులై 15 (ప్రజా జ్యోతి)** పట్టణానికి చెందిన న్యాయవాది, ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ (43) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. రవికుమార్ నాయక్ కు చాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్ నాయక్ మృతదేహాన్ని ఇల్లందు బార్ అసోసియేషన్ సభ్యులు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్ కుమార్ సందర్శించి సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అదేవిధంగా పట్టణ పుర ప్రముఖులు భూక్య రవికుమార్ నాయక్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

## పోడు భూములకు పట్టాలివ్వాలి

- **సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్**



**పినపాక, జూలై 15 (ప్రజాజ్యోతి)** దశాబ్దాలుగా పోడు భూములను నమ్ముకుని జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, వారిపై అటవీ శాఖ అధికారులు అవలంబిస్తున్న మొండి వైఖరిని వీడాలని సీపీఐ మండల కార్యదర్శి తోగటి కుమార్ డిమాండ్ చేశారు. ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్డులోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బోటిగూడెం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని బందరిగినగరం గ్రామంలో నిరుపేద గిరిజనులు గత రెండున్నర దశాబ్దాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. తరతరాలుగా ఆ భూమినే నమ్ముకుని బతుకుతున్న గిరిజనులను, ఇప్పుడు అటవీ అధికారులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. సాగు చేసుకుంటున్న గిరిజనులను ఇబ్బందులకు గురిచేయడం సరి కాదని హితవు పలికారు. గతంలో అదే గ్రామ పరిధిలో పోడు సాగుచేసుకుంటున్న కొందరికి పోడు పట్టాలిచ్చారని, కానీ దాదాపుగా మరో 45 మందికి మాత్రం పట్టాలివ్వలేదని చెప్పారు. భూమినే దైవంగా నమ్ముకుని జీవిస్తున్న వారిపై అధికారులు, పాలకులు సానుకూలంగా స్పందించాలని కోరారు. ఈ సమస్యపై తక్షణమే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో స్పందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఈ గిరిజనులు అందరికీ సాగు భూములపై యాజమాన్య హక్కులు కల్పించాలని, అటవీ అధికారుల వేధింపులకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. లేనిపక్షంలో గిరిజనుల పక్షాన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అలాగే, ఇటీవలే కొందరు పాత్రికేయ మిత్రులపైనా అటవీ అధికారులు దురుసుగా ప్రవర్తించినట్లు తెలిసిందని, దానిని సీపీఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.

## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు సీజ్



**ములకలపల్లి, జూలై 15 (ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలోని పాములేరు వాగు నుంచి నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై మధుప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, నమ్మదగిన సమాచారం మేరకు పాములేరు వాగు పరివాహక ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని ములకలపల్లి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి సహజ వనరులను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎస్సై మధుప్రసాద్ హెచ్చరించారు.

## గిరిజన పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి

- డీఈవోకు వినతిపత్రం అందజేత



**చర్ల, జూలై 15 (ప్రజా జ్యోతి):** చర్ల మండలంలోని మారుమూల గిరిజన గ్రామాలైన రామచంద్రపురం, కిష్టారంపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మిం చి, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని యువ న్యాయవాది పరిటాల సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు.ప్రస్తుతం ఈ గ్రామాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు సరైన భవనాలు లేక తాత్కాలిక గుడిసెల్లో కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. వర్షాకాలంలో గాలి, వర్షం కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తరగతులు సక్రమంగా నిర్వహించేందుకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో చిన్నారుల విద్య దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు కూడా పట్టణ ప్రాంతాల పిల్లలతో సమానంగా నాణ్యమైన విద్య అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకు అనుగుణంగా రామచంద్రపురం, కిష్టారంపాడు పాఠశాలలకు శాశ్వత భవనాలతో పాటు అవసరమైన తరగతి గదులు, ప్రాథమిక వసతులు కల్పించాలని కోరారు.ఈ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు చర్ల మండల యువత ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) వసంతికి వినతిపత్రం సమర్పించారు. గిరిజన ప్రాంతాల పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టి చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వెంటనే నూతన భవనాల నిర్మాణానికి ఆమోదం తెలపాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో యువ న్యాయవాది పరిటాల సంతోష్, బోరా పెద్దిరెడ్డి, అలవాల మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మికంగా ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి

- నిబంధనలను ఉల్లంఘించినట్లయితే
- 1985 సంబంధితచట్టాల ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన "వ్యవసాయ అధికారి"





**అశ్వాపురం, జులై 15, ప్రజా జ్యోతి**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని ఎరువుల దుకాణాలపై అకస్మాత్తుగా తనిఖీ చేసిన వ్యవసాయ అధికారి చటర్జీ. ఎఫ్ సి ఓ నిబంధన ప్రకారం వివిధ రకాల ఎరువుల నమూనాను సేకరించి నాణ్యత విశ్లేషణ నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. అనంతరం ఎరువుల నిల్వలు, విక్రయ రికార్డు, లైసెన్స్ స్టాక్ రిజిస్టర్ మరియు ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించారు. ఎరువులు విక్రదారులు ఎప్పటికప్పుడు రికార్డులను సక్రంగా నిర్వహించాలని రైతులకు ఎరువుల విక్రయించే సమయంలో తప్పనిసరి బిల్లులను జారీ చేయాలని వ్యవసాయ అధికారి ఆదేశించారు. ఎరువులని ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలని నిబంధనలు ఉల్లంఘించినట్లయితే ఫర్టిలైజర్ కంట్రోల ఆర్డర్ 1985 చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అదే కాకుండా రైతులు ఎరువులను కొనుగోలు చేస్తే సమయంలో తప్పనిసరిగా బిల్లులను తీసుకోగలరని తెలిపారు.

# విద్యతోనే భవిష్యత్తు బంగారం



**చర్ల, జూలై 15:(ప్రజా జ్యోతి):** విద్యార్థులు చిన్ననాటి నుంచే స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యమని ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వేమాల ప్రసాద్ అన్నారు. తన కుమారుడు నిహాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలోని కొమరం భీం విద్యార్థి నిలయంలో బుధవారం విద్యార్థులకు దుస్తులు, కాంపస్ బాక్సులు, పెన్నులు, పెన్సిల్స్, పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తిగా ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో ఏం కావాలనే లక్ష్యాన్ని చిన్నప్పుడే నిర్ణయించుకుని దానికి అనుగుణంగా కృషి చేస్తే విజయాన్ని సాధించవచ్చన్నారు.కొమరం భీం విద్యార్థి నిలయంలో విద్యార్థులు పాటిస్తున్న క్రమశిక్షణ తనను ఎంతో ఆకట్టుకుందని, అందుకే తన కుమారుడి జన్మదిన వేడుకలను ఇక్కడ నిర్వహించి విద్యార్థులతో ఆనందాన్ని పంచుకున్నట్లు తెలిపారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ద్వారా సమాజానికి ఉపయోగపడే మంచి సందేశం ఇవ్వవచ్చన్నారు.కొమరం భీం విద్యార్థి నిలయ కార్యదర్శి జవ్వాది మురళీకృష్ణ మాట్లాడుతూ, జన్మదినాలు, ఇతర శుభకార్యాల సందర్భంగా అనవసర ఖర్చులు చేయకుండా పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి అందించడం అభినందనీయమన్నారు. వనవాసీ కళ్యాణ పరిషత్‌కు ప్రభుత్వ నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందడం లేదని, దాతల సహకారంతోనే విద్యార్థి నిలయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దేశవ్యాప్తంగా విద్యార్థి నిలయాలను నిర్వహిస్తున్న సంస్థకు దాతలు అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. విద్యార్థులు తమకు లభిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్యతోనే వ్యక్తిత్వ వికాసం, వినయం, బాధ్యత పెరుగుతాయని, కుటుంబంలో ఒకరు ఉన్నత విద్యను అభ్యసించి స్థిరపడితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందని అన్నారు.గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం దాతలు మరింత ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వేమాల సునీత, వనవాసీ కళ్యాణ పరిషత్ జిల్లా సహ కార్యదర్శి గోగికార్ రాంలక్ష్మణ్, జిల్లా సంఘటనా సహ కార్యదర్శి గొంది శోభన్ బాబు, కొమరం భీం విద్యార్థి నిలయ ప్రముఖ్ ఆకుల సాంబయ్య, శబరి బాలికా నిలయ ప్రముఖ్ వరలక్ష్మి, మడకం చందు, కూడం ఉంగయ్య, ప్రసాద్ కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గిరిజన మహాసభలను జయప్రదం చేయాలి

**చర్ల, జూలై 15 (ప్రజా జ్యోతి):** తెలంగాణ గిరిజన సమాఖ్య (టీజీఎస్) రాష్ట్ర 3వ మహాసభలను ఈ నెల జూలై 18, 19 తేదీల్లో పాల్వంచలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు కల్లూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మహాసభలను గిరిజనులు అధిక సంఖ్యలో పాల ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. చర్లలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నూపా పోతయ్య అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 80 సంవత్సరాలు పూర్తవుతున్నప్పటికీ ఆదివాసీ, గిరిజనుల జీవన పరిస్థితుల్లో ఆశించిన మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమం పేరుతో ప్రభుత్వాలు నిధులు కేటాయించినా, చట్టాలు తీసుకొచ్చినా వాటి అమలులో నిర్లక్ష్యం కారణంగా గిరిజనులు ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని విమర్శించారు.ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం 1957లో ఏర్పడిన అఖిల భారత ఆదివాసీ మహాసభ దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించి గిరిజనులను చైతన్యపరిచిందని తెలిపారు. అటవీ హక్కుల చట్టం అమలు, సాగు భూములపై హక్కుల కోసం ఉద్యమాలు చేపట్టిందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 50,595 మంది గిరిజన రైతులకు సుమారు 1,51,195 ఎకరాల భూములకు పట్టాలు ఇప్పించడంలో తెలంగాణ గిరిజన సమాఖ్య కీలక పాత్ర పోషించిందని అన్నారు .రాష్ట్ర మహాసభల్లో గిరిజనుల సమస్యలపై పలు కీలక డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పోడు భూములకు వెంటనే హక్కు పట్టాలు ఇవ్వ డం, 50 ఏళ్లు నిండిన ప్రతి గిరిజనుడికి రూ. 6 వేల పెన్షన్ మంజూరు చేయడం, అటవీ శాఖ వేధింపులను నిలిపివేయడం, అటవీ బంజరు భూములు, ప్రభుత్వ మిగు లు భూములను పేదలకు పంపిణీ చేయడం, ఇళ్ల స్థలాలు మంజూరు చేసి పట్టాలు ఇవ్వడం, అర్హులైన గిరిజనులకు ట్రై కార్ రుణాలు అందించడం, గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, విద్యుత్, రహదారులు, వంతెనలు, తాగునీరు, సాగునీటి వంటి మౌలిక సదుపాయాలు కల్పించడం, జీవో నెం.3ను పునరుద్ధరించడం, ఏజెన్సీ డీఎస్సీని వెంటనే నిర్వహించడం వంటి డిమాండ్లపై మహాసభలో తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు.గిరిజనుల అభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించి ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాల్వంచలో జరిగే రాష్ట్ర మహాసభలు, బహిరంగ సభలకు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థా యి నాయకులు హాజరవుతారని తెలిపారు. గిరిజనులు పెద్ద ఎత్తున పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర 3వ మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అడ్డగర్ల తాతాజీ, మండల కార్యదర్శి నూపా పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, గిరిజన నాయకులు కల్లూరి సీతారాములు, సోడి సీతారాములు, కొమరం వెంకటేశ్వర్లు, కట్టం నాగేశ్వరరావు, మడివి దేవయ్య పాల్గొన్నారు.




## జిఎస్ పీ నూతన కమిటీల నియామకం



**చర్ల, జూలై 15 :(ప్రజా జ్యోతి):** గొండ్వానా సంక్షేమ పరిషత్ (జీఎస్పీ) ఉభయ రాష్ట్రాల కన్వీనర్ సొందే వీరయ్య ఆధ్వర్యంలో బుధవారం చర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, డివిజన్, మండల స్థాయి నూతన కమిటీలను ప్రకటించి బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా సోందే వీరయ్య మాట్లాడుతూ, షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసుల భూముల రక్షణ కోసం రూపొందించిన 1/70 చట్టం అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆదివాసుల భూములు, హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనాల కోసం చట్టాల అమలును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో వలసలను ప్రోత్సహిస్తూ ఆదివాసుల హక్కులను దెబ్బతీసే విధంగా చట్టాలను సవరించే కుట్రలు జరుగుతున్నాయని, ఇటీవల సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లు కూడా అదే దిశగా ఉన్నాయని పేర్కొన్నారు. 1/70 చట్టం కారణంగానే ఆదివాసుల వద్ద కొంత భూమి ఇప్పటికీ రక్షితంగా ఉందని, ఆ చట్టం లేకుంటే భూస్వాములు, ఇతరులు ఆ భూములను పూర్తిగా ఆక్రమించుకునేవారని అన్నారు.ప్రస్తుతం 1/70 చట్టం ప్రమాదంలో ఉన్న నేపథ్యంలో ఆదివాసులంతా ఐక్యంగా ఉద్యమించి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.అనంతరం గొండ్వానా సంక్షేమ పరిషత్ నూతన కమిటీలను ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా పా యం సత్యనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పూణెం సాయి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కల్లూరి కిషోర్ నియమితులయ్యారు.జిల్లా అధ్యక్షుడిగా బీ రబోయిన శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బీ రబోయిన అరుణ, జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా గొంది లీలాప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు.డివిజన్ అధ్యక్షుడిగా వర్షా ముదిరాజు, ప్రధాన కార్యదర్శిగా పాయం సన్యాసి, కార్యదర్శిగా తెల్లం రామకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సున్నం సుబ్బయ్య, ఇర్పా మల్లూరు నియమితులయ్యారు.మండల అధ్యక్షుడిగా ఇర్పా అంజిబాబు, ప్రధాన కార్యదర్శిగా కాయం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా గొంది కార్తీక్, సహాయ కార్యదర్శిగా సరేం ర వీంద్ర, వర్కింగ్ అధ్యక్షుడిగా శ్యామల లక్ష్మణరావు ఎన్నికయ్యారు. మండల కా ర్యవర్గ సభ్యులుగా కారం సాయమ్మ, మడకం రాజశేఖర్, పాయం రామచంద్ర య్య, సున్నం కృష్ణ, మడివి వెంకటేష్, వాసం వంశీ, తెల్లం సుశీల, కారం సుధ, కారం లక్ష్మి , సున్నం సీతమ్మ, ఉయిక పార్వతమ్మ, పొడియం రామక్కలను ని యమించారు.నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు సంస్థ బలోపేతం తో పాటు ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం సమష్టిగా పనిచేస్తామని తెలిపారు.

# అద్దంకికి మంత్రి హోదాపై హర్షం

- దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన నిర్ణయం
- జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి





**చర్ల, జూలై 15 (ప్రజా జ్యోతి):** జాతీయ మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ అద్దంకి దయాకర్కు తెలంగాణ ప్రభుత్వం మంత్రి హోదా కల్పించడం రాష్ట్రంలోని దళితులకు, తెలంగాణ ఉద్యమకారులకు దక్కిన గౌరవమని జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు తోటమల్ల రమణమూర్తి అన్నారు. ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ బుధవారం చర్ల మండల కేంద్రంలో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తోటమల్ల రమణమూర్తి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు దళితుల హక్కుల పరిరక్షణ కోసం డాక్టర్ అద్దంకి దయాకర్ చేసిన పోరాటాలు, ప్రజాసేవకు గుర్తింపుగానే కాంగ్రెస్ ప్రభుత్వం ముందుగా ఆయనను ఎమ్మెల్సీగా, ప్రభుత్వ విప్గా నియమించిందన్నారు. అనంతరం ఆయన సేవలను గుర్తించి మంత్రి హోదా కల్పించడం సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న అభినందనీయమైన నిర్ణయమని అన్నారు.రాష్ట్రంలోని కోట్లాది మంది దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే దిశగా ఈ నిర్ణయం ఒక కీలక అడుగని, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని అన్నారు.జిల్లా వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎడెల్లి గణపతి మాట్లాడుతూ డాక్టర్ అద్దంకి దయాకర్కు మంత్రి హోదా రావడం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు దళిత ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్సీ కార్పొరేషన్, గురుకులాలు, ఇతర సంక్షేమ పథకాలకు అధిక నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని తెలిపారు.జిల్లా ఉపాధ్యక్షుడు పల్లంటి రమేష్ మాట్లాడుతూ తమ ఉద్యమ నాయకుడికి మంత్రి హోదా రావడం దళిత సమాజానికి పండుగలాంటి సందర్భమన్నారు. అసెంబ్లీలోనూ, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ దళితుల గొంతుకగా నిలిచిన అద్దంకి దయాకర్కు మంత్రి హోదా రావడం వల్ల ప్రజాసేవకు మరింత అవకాశాలు లభిస్తాయని అన్నారు . సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.అనంతరం జాతీయ మాల మహానాడు జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో యువకుడి ఆత్మహత్యాయత్నం



**టేకులపల్లి,జూలై 15, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలం ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డులో బోడ బాలాజీ ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా, వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. గతంలో జరిగిన ఘర్షణ, బంగారు మంగళసూత్రాల వివాదంలో న్యాయం జరగకపోవడంతో మనస్తాపానికి గురై ఈ చర్యకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ప్రవేశాలకు శ్రీకారం

- ఎర్రగుంట పాఠశాలలో చిన్నారులకు పాఠ్యపుస్తకాల పంపిణీ
- తల్లిదండ్రులకు ఎంఈఓ ఆనంద్ పిలుపు





**అన్నపురెడ్డిపల్లి, జూలై 15 (ప్రజా జ్యోతి):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక ) తరగతుల విద్యార్థులకు మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద్ కుమార్ బుధవారం పాఠ్యపుస్తకాలను అందజేసి అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించి ప్రభుత్వ విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.మండలంలోని అన్నదేవం, రాజాపురం, ఎర్రగుంట ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రభుత్వం ఏర్పాటు చేసి, ఇన్ స్ట్రక్టర్లు, ఆయాలను నియమించిందని తెలిపారు. ప్రతి ప్రీ ప్రైమరీ పాఠశాల ఆధునికీకరణ కోసం విద్యాశాఖ రూ.1 లక్షల గ్రాంటు అందజేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఎర్రగుంట ప్రాథమిక పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయురాలు సంధ్య, కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టేకులపల్లిలో సీహెచ్ ఆర్ ఎస్ కరపత్రాల విడుదల



**టేకులపల్లి,జూలై15, ప్రజాజ్యోతి:** క్రైస్తవ హక్కుల రక్షణ సమితి (సీహెచ్ ఆర్ ఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగల్ తండాలో బుధవారం సేవకుల సమావేశం నిర్వహించారు. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జన్ను ఇర్మియ ఆధ్వర్యంలో జూలై 24న వరంగల్ లో జరిగే సీహెచ్ ఆర్ ఎస్ రెండో వార్షికోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలు, వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ 25 డిమాండ్లపై అవగాహన కల్పించారు. అనంతరం టేకులపల్లి మండల కమిటీని ఎన్నుకుని అధ్యక్షుడిగా పాస్టర్ ఏ. శ్రీనివాస్ పాల్, ప్రధాన కార్యదర్శిగా పాస్టర్ టీ. మోసే సహా ఇతర పదాధికారులను ప్రకటించారు.

## అటవీ సంరక్షణ మనందరి బాధ్యత





**బూర్గంపహాడ్, జూలై 15, (ప్రజా జ్యోతి ):** అడవుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ముసలమడుగు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అనార్కలి అన్నారు.బుధవారం పాల్వంచ రేంజ్, సోంపల్లి బీట్ పరిధిలోని బుడ్డగూడెం గ్రామంలో ముసలమడుగు సెక్షన్, సోంపల్లి బీట్ అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివాసీలకు అటవీ సంరక్షణ,పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ మరియు పోడు సాగుపై అవగాహన సదస్సును నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ప్రకారం చెల్లుబాటు అయ్యే అటవీ హక్కు పత్రాలు లేని భూములపై పోడు సాగు చేయరాదని, దుక్కులు దున్నవద్దని, పంటలు వేయవద్దని సూచించారు. చట్టవిరుద్ధంగా అడవులను నరికి, ప్రభుత్వ ప్లాంటేషన్లను ధ్వంసం చేసి పోడు సాగు చేసినట్లయితే అటవీ చట్టాలు, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్తగా అడవులను ఆక్రమించి పోడు భూములు సృష్టించవద్దని, అడవులకు నిప్పు పెట్టరాదని, వన్యప్రాణులను వేటాడరాదని, అటవీ సంపదను భావితరాలకు పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు. అటవీ పరిరక్షణలో గ్రామస్థులు అటవీ శాఖకు సహకరించాలని, అడవుల్లో ఎలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించిన వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సోంపల్లి మాజీ సర్పంచ్ తాటి వీరాంజనేయులు, సోంపల్లి పంచాయతీ గ్రామ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, సోంపల్లి బీట్ ఆఫీసర్ సోడె శ్రీరాములు, ముసలిమడుగు ఈస్ట్ బీట్ ఆఫీసర్ మడకం వీరేందర్, ముసలమడుగు వెస్ట్ బీట్ ఆఫీసర్ బాణావత్ సురేష్, చెరువు సింగారం బీట్ ఆఫీసర్ భూక్యా పద్మ, నకిరిపేట బీట్ ఆఫీసర్ దొడ్డ పెద్ద రామ్మూర్తి, చెరువు సింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానొత్ నవీన్, ముసలిమడుగు నార్త్ బీట్ ఆఫీసర్ మూడ్ ఝూన్సీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే గిరిజన హక్కుల సాధన సాధ్యం

- తెలంగాణ గిరిజన సమైక్య నేతలు






**ఆళ్లపల్లి,జూలై15(ప్రజా జ్యోతి )** పోరాటాల ద్వారానే గిరిజన హక్కులను పరిరక్షించుకోవచ్చని తెలంగాణ గిరిజన సమైక్య జిల్లా అధ్యక్షుడు సోంది కుటుంబరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్య శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో అరేం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల మహాసభలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న పోడు పట్టాలు వెంటనే పంపిణీ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో పెసా చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో పాల్వంచలో జరిగే తెలంగాణ గిరిజన సమైక్య మూడో రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కొమరం రాంబాబు అధ్యక్షుడిగా, అరేం రామకృష్ణ ప్రధాన కార్యదర్శిగా, పూనం సూర్యనారాయణ సహాయ కార్యదర్శిగా, జోగా మల్లేష్, గొగ్గల బుచ్చయ్య, రాజేష్ ఉపాధ్యక్షులుగా, పూనెం వెంకటేష్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, గౌరబోయిన సీత కోశాధికారిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొగ్గల కృష్ణ, జిల్లా నాయకులు కణితి సత్యం, వజ్జ వెంకటేశ్వర్లు, కన్నెబోయిన ప్రసాద్, గారెబోయిన నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణిని కాపాడకపోతే కార్మికుల భవిష్యత్తు అంధకారమే

- తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ కోసం తొలి ఉద్యమం ఎఐటీయూసిదే
- రూ.56 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి కె. సారయ్య
- అన్ని బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి ఎండి. నజీర్ అహ్మద్
- 31 డిమాండ్ల పరిష్కారం లేకుంటే ఆగస్టులో సమ్మె తప్పదని హెచ్చరిక





**టేకులపల్లి,జూలై15, ప్రజాజ్యోతి:** రాజకీయ ప్రయోజనాల కోసం యాత్రలు, హామీలు, ప్రకటనలు చేస్తున్న పాలకులు సింగరేణి పరిరక్షణ విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసి) కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య విమర్శించారు. సింగరేణి సంస్థను బలోపేతం చేయకపోతే వేలాది మంది కార్మికుల కుటుంబాల జీవనోపాధితో పాటు తెలంగాణ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.బుధవారం కెఓసీలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిట్ సమావేశానికి ఫిట్ కార్యదర్శి మాలోత్ హరిసింగ్ అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో కేంద్ర కమిటీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎండి. నజీర్ అహ్మద్ పాల్గొని కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు.వారు మాట్లాడుతూ తాడిచర్ల–2 బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేస్తూ 2012లో అన్ని కార్మిక సంఘాలను ఏకం చేసి తొలి ఉద్యమాన్ని ఎఐటీయూసి చేపట్టిందని గుర్తు చేశారు. ఆ పోరాట ఫలితంగానే అప్పటి ప్రభుత్వం ఆ బొగ్గు బ్లాక్ ను సింగరేణికి కేటాయించిందన్నారు.ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించకుండా ప్రైవేటు సంస్థలకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ప్రభుత్వ రంగ సంస్థ బలహీనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలు ఉన్న సింగరేణిని నిర్వీర్యం చేసే విధానాలు అమలు చేయడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. నిధుల కొరత కారణంగా అవసరమైన పనిముట్లు కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని, ఇది సంస్థ అభివృద్ధికి తీవ్ర ఆటంకంగా మారిందని అన్నారు.కార్మికుల న్యాయమైన హక్కుల కోసం ఇప్పటికే 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చామని, రెండు దఫాల చర్చలు జరిగినప్పటికీ ప్రభుత్వం, యాజమాన్యం నుంచి స్పష్టమైన హామీ రాలేదని తెలిపారు. కొత్త బొగ్గు బ్లాకుల ఏర్పాటు, 12వ వేతన కమిటీ ఏర్పాటు, నాలుగు లేబర్ కోడ్ల రద్దు, పేరెక్స్ పై ఆదాయపన్ను భారాన్ని సింగరేణి భరించడం, కార్మికుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని రీయింబర్స్ చేయడం, మారు పేర్ల సమస్య పరిష్కారం, మెడికల్ బోర్డు కొనసాగింపు, సొంతింటి పథకం అమలు తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ఆగస్టు నెలలో ఇతర కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు దిగడం అనివార్యమవు తుందని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొంగర వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి మాలోత్ హరిసింగ్, సహాయ కార్యదర్శులు బాలుకుమార్, షేక్ సర్వర్, జి.ఏ. శ్రీనివాస్, నూనె శ్రీనివాస్, అజ్మీరా కిషోర్, కరుణ శంకర్, అహ్మద్,వెంకట నర్సయ్య, వినీత్ కుమార్, ఉమామహేశ్వరరావు, వినయ్ బాబు, పైడిరాజు, ప్రణయ్ కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో పారదర్శకతకు తాళం

- చట్టం నిర్దేశించిన గడువులో సమాచారం ఇవ్వని అధికారులు.
- సమాచారం అందించేందుకు అయ్యే ఖర్చు వివరాలు సైతం వెల్లడించని వైనం.
- సమాచారం దాచాల్సిన అవసరం ఏమిటి ?
- అధికారులు మౌనం వెనుక అసలు మర్మమేంటి ?
- జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్న ప్రజల డిమాండ్






**పాల్వంచ, జూలై 15, ప్రజాజ్యోతి:** ప్రజలకు రాజ్యాంగబద్ధంగా కల్పించిన సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ని అమలు చేయాల్సిన ప్రభుత్వ అధికారులే అదే చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారా అనే ప్రశ్నలు పాల్వంచ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వ్యవహారంలో బలంగా వినిపిస్తున్నాయి. ఆసుపత్రి నిర్వహణ, అందుబాటులో ఉన్న వైద్యం, ఆసుపత్రి సిబ్బంది పని వేళలు, సిబ్బంది వివరాలు, అందుబాటులో ఉన్న వైద్య పరీక్షల వివరాలు, రోగులకు అందిస్తున్న సేవలు, రోగులకు అందించే భోజన మెనూ వివరాలు కోరుతూ ఆర్టీఐ దాఖలు చేసిన దరఖాస్తుదారుడు కొడుపుగంటి శ్రీనివాస్(100 రోజుల శ్రీను) దాఖలు చేసిన దరఖాస్తుకు అధికారులు చట్టం నిర్దేశించిన గడువు ముగిసినా ఇప్పటివరకు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

### »» అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం ....

సమాచారం ఇవ్వలేని పరిస్థితుల్లో కారణాలు తెలియజేయాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉండగా, ఆ బాధ్యతను సైతం విస్మరించారని దరఖాస్తుదారుడు ఆరోపించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం అందించలేని పరిస్థితుల్లో కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆ దిశగా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అంతేకాకుండా, సమాచారం అందించడానికి అయ్యే ఫీజు ఎంత అనే కనీస వివరాలను కూడా తెలియజేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందని పేర్కొన్నారు.

### »» సమాచారం ఇవ్వడం లో సందేహం ఎందుకు..?

ఆసుపత్రి రికార్డులు సక్రమంగా ఉన్నట్లయితే సమాచారం ఇవ్వడానికి ఎందుకు వెనుకంజ వేస్తున్నారని ప్రజల్లో ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం ఇవ్వడంలో అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారనే అంశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పారదర్శకంగా వ్యవహరించాల్సిన ప్రభుత్వ సంస్థలు చట్టబద్ధమైన సమాచారాన్ని కూడా అందించకపోవడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### »» క్యాష్ కొట్టు సర్టిఫికెట్ పట్టు...

మెడికల్ సర్టిఫికెట్ అవసరమై కొందరు ప్రభుత్వ ఆసుపత్రి కి వెళ్ళగా అక్కడ ఆసుపత్రి సిబ్బంది ప్రవర్తన చూసి ముక్కున వేలేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మెడికల్ సర్టిఫికెట్ కావాలంటే క్యాష్ కట్టాల్సిందేనంటూ కొందరు ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురి అయ్యామని, డబ్బులు ఇవ్వలేని పక్షం లో మెడికల్ సర్టిఫికెట్ ఇవ్వడానికి కూడా నిరాకరించారని, తప్పక పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రి లో డబ్బులు కట్టి మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొన్న ఇబ్బందులకు సంబంధించిన పూర్తి ఆధారాలతో త్వరలోనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)ను కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. అవసరమైతే ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.

### »» ప్రజల్లో వ్యక్తమవుతున్న ప్రశ్నలు....

సమాచారం ఇవ్వడంలో అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారు? ఆసుపత్రి వ్యవహారాలన్నీ సక్రమంగా ఉంటే సమాచారం ఇవ్వడానికి అభ్యంతరం ఏమిటి?ఆర్టీఐ వంటి రాజ్యాంగ బద్ధమైన హక్కునే అధికారులు ఉల్లంఘిస్తుంటే, పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిజంగా అందుతున్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారదర్శకత, జవాబుదారీతనం ఎక్కడ అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

### »» జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలి ....

ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టిసారించి, సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఈ పరిణామం సమాచార హక్కు చట్టం అమలుపై అధికార యంత్రాంగం వైఖరిని ప్రశ్నించేలా ఉండటంతో పాటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పారదర్శక పాలన అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ విద్యాచందన ఆదేశం





**టేకులపల్లి,జూలై 15, ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని గ్రామ సమాఖ్య భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) & జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) అధికారి విద్యాచందన ఆదేశించారు. బుధవారం ఆమె కొప్పురాయి గ్రామపంచాయతీ పరిధిలోని థారపాడు, లక్ష్మీపురం గ్రామాలు, బోడు గ్రామపంచాయతీ పరిధి, గోలియాతండ ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న గ్రామ సమాఖ్య భవనాలను పంచాయతీరాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. నిర్మాణాల పురోగతిని సమీక్షించిన ఆమె, పనులు చేపడుతున్న సప్లయర్లు, సంబంధిత శాఖ ఇంజనీర్లకు నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా, ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తయిన భవనాలకు సంబంధించిన బిల్లులను వెంటనే సిద్ధం చేసి పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అనంతరం టేకులపల్లి మూడు కాలనీలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినుల కోసం యూనిఫాంలు తయారు చేస్తున్న కుట్టు మిషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. మహిళలకు ఉపాధి కల్పించే ఈ కేంద్రం కార్యకలాపాలపై వివరాలు తెలుసుకుని నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి కొండపల్లి శ్రీదేవి, ఏఈ నవీన్, ఏపీవో కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, ఏపీఎం కరుణాకర్, సర్పంచులు పోడెం స్వరూప, కార్యదర్శులు సన్యాసి, లక్ష్మణ్, టీఏ ఈశ్వరి, సీసీలు సునీల్,బాయమ్మ, నాగేశ్వరరావు,ఎఫ్ఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.